## క్లుప్తంగా

### ఘనంగా అమ్మవారి వార్షికోత్సవం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలోని పంటపొలాల వద్ద ఉన్న దుర్గమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో అమ్మవారికి ముందుగా రైతులు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కొంకుదురు, పందలపాక, ఊలపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

### 134 మందికి వైద్య పరీక్షలు



సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజేష్

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో ఆదివారం రాజమహేంద్రవరానికి చెందిన హరిత న్యూరో సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హరిత న్యూరో సెంటర్ న్యూరో ఫిజీషియన్, స్ట్రోక్ వైద్యనిపుణులు డాక్టర్ క్రొవ్విడి రాజేష్, డాక్టర్ సత్యం రమేష్‌బాబు సుమారు 134 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రొవ్విడి నరసింహారావు, రామరాజు, ఎస్ వెంకటలక్ష్మి, సురేష్ బాబు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### 7న కాలభైరవ విగ్రహ ప్రతిష్ఠ

రాజానగరం: తూర్పుగానుగూడెంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీ కుబేర స్వర్ణాకర్షణ కాలభైరవ స్వామి ఆలయంలో ఈనెల 7వ తేదీన స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం 7.49 గంటలకు విగ్రహ ప్రతిష్ఠోత్సవం జరగనుంది.

### ఇసుక ట్రాక్టర్ల సీజ్



కాపవరం వద్ద సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

మధురపూడి: కాపవరం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశామని ఎస్ఈబీ సీఐ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. సీతానగరం మండలం ముగ్గళ్ల ఇసుక ర్యాంపు నుంచి అదే గ్రామానికి చెందిన రెండు ట్రాక్టర్లపై అనమతుల్లేకుండా ఇసుకను తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు. ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కోరుకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించామని కేసు నమోదు చేశారని ఎస్ఈబీ సీఐ సత్యనారాయణ తెలిపారు.

### ఇరువర్గాల ఘర్షణపై కేసు

సీతానగరం: వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలోని రాజంపేటలో ఓసీ, ఎస్సీల యువకుల మధ్య ఘర్షణ నెలకొంది. ఈ ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్టు సీతానగరం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాజంపేట బడ్డీకొట్టు వద్ద ఓసీ యువకులు కూల్ డ్రింక్‌లు తాగుతుండగా మునికూడలికి చెందిన ఎస్సీ యువకులు వచ్చి వారిని దుర్భాషలాడి ఘర్షణకు దిగారు. మళ్లీ మధ్యాహ్నం ఎస్సీ యువకులు రాజంపేట వచ్చి ఘర్షణ పడ్డారు. దీంతో ఇరువర్గాల వారు పెద్ద సంఖ్యలో గుమిగూడడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే హెడ్ కానిస్టేబుల్ బి.లక్ష్మణరావు తన సిబ్బందితో వచ్చి ఇరువర్గాలను చెదరకొట్టారు. కటారి సత్యనారాయణ, కటారి సుబ్రహ్మణ్యం, కటారి ఏసులు మునికూడలికి చెందిన రేలంగి బబ్బుల్, గాడాల దుర్గాప్రసాద్, మురాల బండలపై ఫిర్యాదు చేశారు. అదే విధంగా మునికూడలి యువకులు రాజంపేటకు చెందిన ముగ్గురుపై ఫిర్యాదు చేశారని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

### గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



మృతుడు

రాజమహేంద్రవరం సిటీ: సుమారు 60 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి గోదావరి రైల్వే స్టేషన్‌కు అన్నపూర్ణంపేట గేటుకు మధ్యలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడని జీఆర్పీ ఎస్సై మావుళ్లు తెలిపారు. మృతుని శరీరంపై నీలం రంగు లుంగీ, తెలుపు రంగు చొక్కా, నీలంరంగు మీద తెలుపు గడులు ఉన్న టవల్ ధరించి ఉన్నాడన్నారు. మరే విధమైన ఆధారాలు లభ్యం కాలేదని, కుడి కాలు మీద బొల్లి మచ్చ గుర్తించామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆచూకీ తెలిసిన వారు రాజమహేంద్రవరం జీఆర్పీ స్టేషన్‌లోని 0883 2442821, 9491003239, 9440627551నంబర్లను సంప్రదించాలని కోరారు.

# వైఎస్సార్ బీమా భరోసా

- 18 నుంచి 70 ఏళ్ల వయసున్నవారు అర్హులు
- గ్రామగ్రామాన నమోదు చేపట్టిన వలంటీర్లు

బిక్కవోలు: కుటుంబాన్ని పోషించే వ్యక్తి మరణించినా, వైకల్యం బారినపడినా ఆ కుటుంబం ఆర్థిక కష్టాల్లో చిక్కుకుంటుంది. ఆపద వేళ ఆయా కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని తీసుకొచ్చింది. తాజాగా 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీమా నమోదు ప్రకియను ప్రారంభించింది. గ్రామగ్రామాన వలంటీర్లు ఇంటింటికీ తిరిగి వైఎస్సార్ బీమా రెన్యువల్‌తో పాటు కొత్తగా లబ్ధిదారుల్ని గుర్తించి పథకంలో నమోదు చేస్తున్నారు.

వైఎస్సార్ బీమా పథకం కింద అర్హులను వలంటీర్లు యాప్‌లో నమోదు చేస్తున్నారు. బీమా కింద సభ్యుల నమోదు కోసం వివరణాత్మక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్ఓపీ)పై ఇప్పటికే వలంటీర్లకు పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. అనపర్తి నియోజకవర్గంలో 87,829 బియ్యం కార్డులుండగా 77,284 మంది వైఎస్సార్ బీమా పథకంలో నమోదయ్యారు. 73,411 మంది ఈ ఏడాదికి రెన్యువల్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. గతంలో బీమా ఉండి ఈ నెల 10వ తేదీ నాటికి పాలసీదారు వయసు ప్రమాద బీమా అర్హతకు మించితే ఆ స్థానంలో కుటుంబంలోని మరో సంపాదనపరుడిని ఎంచుకోవచ్చు. వారి పేరుపై బీమా నమోదుచేస్తారు. కొత్తగా 3,873 మంది బీపీఎల్ కుటుంబాల్లో ఈ-కేవైసీ ద్వారా బీమా నమోదుకు అవకాశం కల్పించారు. ఈ నెల 10వ తేదీ నమోదుకు చివరి రోజు కావడంతో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు నమోదు ప్రక్రియలో నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకూ 10,520 మంది రెన్యువల్, 42 మంది కొత్త వారికి నమోదు పూర్తి చేశారు.

అనపర్తి నియోజకవర్గంలో....

| మండలం | రేషన్‌కార్డులు | అర్హత కలిగిన కుటుంబాలు | కొత్తగా నమోదైన కుటుంబాలు |
|---|---|---|---|
| అనపర్తి | 22,166 | 19,513 | 1,017 |
| బిక్కవోలు | 22,466 | 19,844 | 1,051 |
| రంగంపేట | 19,878 | 17,433 | 848 |
| పెదపూడి | 23,319 | 20,494 | 957 |
| | 87,829 | 77,284 | 3,873 |

**కొత్త మార్గదర్శకాలు ఇలా**

బీమా చట్టం–1938లోని సెక్షన్ 39 ప్రకారం జీవిత భాగస్వామి లేదా పిల్లలు లేదా వారిపై ఆధారపడిన వ్యక్తులను ప్రాథమిక కుటుంబ పోషణదారుడు (పీబీఈ) తమ నామినీని లేదా నామినీలుగా నియమించుకోవొచ్చు. బీమా పొందే వ్యక్తి వయసు 18–70 ఏళ్ళ మధ్య ఉండాలి. ఆ వ్యక్తి దారిద్ర్యరేఖకు దిగువన ఉండాలి. ప్రాథమికంగా సంపాదనపరుడై ఉండాలి. బీమా తీసుకున్న వ్యక్తి 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ళ లోపు సహజ మరణం పొందినా బీమా వర్తిస్తుంది. సహజ మరణానికి రూ.లక్ష పరిహారం, ప్రమాద మరణమైతే రూ.5 లక్షలు సదరు నామినీకి చెల్లిస్తారు. ఒకవేళ బీమాదారుడు పూర్తి అంగ వైకల్యం పొందితే రూ.5 లక్షలు, పాక్షిక వైకల్యం పొందితే రూ.2.50 లక్షలు అందజేస్తారు. పాలసీదారుడు మరణిస్తే సచివాలయంలోని సంక్షేమ సహాయకునికి సమాచారం అందించిన వెంటనే ప్రభుత్వం ద్వారా అంత్యక్రియల ఖర్చుకు రూ.10 వేలు అందజేస్తారు.



పందలపాకలో వైఎస్సార్ బీమా నమోదు చేస్తున్న వలంటీర్

**ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం**



ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం వైఎస్సార్ బీమా లబ్ధిదారుల్ని గుర్తించి పథకంలో నమోదు చేస్తున్నాం. అర్హత కలిగిన వారందరికీ బీమా ఉండేలా అవగాహన కల్పించి పథకంలో చేరుస్తున్నాం.

– పూడి కుసుమ, వలంటీర్, పందలపాక సచివాలయం–1

**పేదలకు ఆర్థిక లబ్ధి చేకురేలా**



పేదలకు ఆర్థిక లబ్ధి చేకురేలా వైఎస్సార్ బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుంది. కుటుంబంలోని పోషించే వ్యక్తి మరణించినా, వైకల్యం బారిన పడిన సమయంలో వైఎస్సార్ బీమా పథకం ఆర్థిక ఉపశమనాన్ని కలిగిస్తుంది.

– సీహెచ్ రాధ, వెల్ఫేర్ అసిస్టెంట్, పందలపాక సచివాలయం–2

### భగ్గుమంటున్న భానుడు



చంద్రేడు గ్రామంలో ఉదయం 10 గంటలకే జన సంచారం లేని రోడ్డు

రంగంపేట: భానుడు భగ్గుమంటున్నాడు. ఎండలకు తట్టుకోలేక గ్రామాల్లోని ప్రజలు అల్లాడుతున్నారు. వడగాల్పులు, అధిక ఉష్ణోగ్రతలతో వృద్ధులు, పిల్లలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం భానుడి ప్రతాపానికి పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీలు నమోదైంది. వారం రోజుల క్రితం వర్షం పడటంతో వేసవితాపం నుంచి ఉపశమనం పొందినా మళ్లీ ఎండలు విజంభిస్తుండడంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు బయటకు రావడానికే భయపడుతున్నారు. సాయంత్రం 7 గంటలకు కూడా ఉక్కబోత తగ్గడం లేదు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ఎండలకు తాళలేక శీతల పానీయాలు సేవించి ప్రజలు సేదతీరుతున్నారు.

## ప్రారంభమైన ప్రతిష్ఠాపన పూజలు



ఆలయ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు



అనపర్తిలో నిర్వహిస్తున్న జనార్దన స్వామి శోభాయాత్ర

అనపర్తి: స్థానిక పాతవూరులో జీర్ణోద్ధరణ గావించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్దన స్వామివారి ఆలయంలో స్వామి, వివిధ దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం విఘ్నేశ్వరపూజతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం విద్వాంసులు విష్ణు భట్టాచార్యులు నిర్వహణలో, బ్రహ్మశ్రీ మిక్కిలి దుర్గయ్య శాస్త్రి పర్యవేక్షణలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులచే శాస్త్రోక్తంగా ప్రతిష్ఠాపన పూజలు జరిపించారు. ఉదయం సంకల్ప దీక్ష, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, పంచగవ్యారాధన, కంకణధారణ, అకల్మషహోమం, సాయంత్రం మృత్సంగ్రహణ, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, కలశస్థాపన, ఉక్త హోమాది క్రతువులు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల విగ్రహాలతో యాగశాల నుంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అశ్వరథ వాహనాలు, కేరళ వాయిద్యాలు, కోలాట నృత్యాలు, బాణాసంచా కాల్పులతో గ్రామ ప్రధాన వీధుల్లో నిర్వహించిన శోభాయాత్రతో గ్రామం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వందలాదిగా తరలివచ్చిన భక్తులు శోభాయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, సర్పంచ్ వారా కుమారి, ఆలయ కమిటీ చైర్మన్ నల్లమిల్లి సీతారామారెడ్డి, కమిటీ సభ్యులు నల్లమిల్లి మునీశ్వరరెడ్డి, కర్రి రామన్నతాత, పడాల చంద్రకళ, కొండేటి భీమేష్, పాలి ఆంజనేయులు, గొలుగూరి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మధురపూడి: పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అటవీ శాఖ దివాన్ చెరువు సెక్షన్ ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వి.పద్మావతిదేవి అన్నారు. ఆదివారం కాపవరంలో మిషన్‌లైఫ్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల జరుగు నష్టాలను వివరిస్తూ, నీటి సంరక్షణ, ఇందనం వాడకం తగ్గించి పర్యావరణ పరిరక్షణపై బాధ్యతగా ఉండాలని అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ సంచులు వాడరాదని, ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ రంగారావు, తానా హెల్పర్ శివ తదితరులు పాల్గొన్నారు.



కాపవరంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖాధికారులు

## వంశ మూలాలను మరువవద్దు



పుస్తక ఆవిష్కరణలో ప్రముఖులు

గండేపల్లి: వంశ మూలాలను మరవ వద్దని నల్లమిల్లి వంశీయులు పేర్కొన్నారు. దేశ, విదేశాల్లో ఉద్యోగ, వ్యాపార, సినీ, రాజకీయ, వ్యవసాయ రంగాల్లో స్థిరపడిన వీరంతా మండలంలోని సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థల ప్రాగణంలో ఆదివారం కలుసుకున్నారు. కాకినాడ జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు నల్లమిల్లి బుచ్చిరెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో నల్లమిల్లి వంశీకుల చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. గిన్నీస్ బుక్, లిమ్కా బుక్, వండర్ బుక్, తెలుగు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కోసం దరఖాస్తు చేసుకున్నట్టు నల్లమిల్లి వంశీకులు తెలిపారు. సుమారు మూడు వేల మంది తమ కుటుంబ సభ్యులతో పాల్గొని సందడి చేశారు. కార్యక్రమంలో కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, సినీ హీరో నల్లమిల్లి సుభాష్, దర్శకుడు, రచయిత నల్లమిల్లి వంశీ, హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, విజయవాడ మెట్రో రైలు ఎండీ నల్లమిల్లి పెద రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా జగన్నాథుని మంగళస్నానం

సీటీఆర్ఐ: జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఇస్కాన్‌లోని జగన్నాథ స్వామికి ఆదివారం ఘనంగా మంగళస్నానం చేయించారు. భక్తులు దర్శించుకునేందుకు వీలుగా స్వామివారి విగ్రహాలను గోదావరి గట్టు వద్దకు తీసుకుని వచ్చి ఉంచారు. అనంతరం స్వామి వారిని రథంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ టెంపుల్ పూజారి శ్యామంగా శ్రీనివాస్ ప్రభు, ఇస్కాన్ రాజమహేంద్రవరం శాఖ అర్చకులు శివానంద నిమయిదాస్, హేమనిమయి దాస్‌లు పాల్గొన్నారు.



స్వామి వారికి మంగళస్నానం చేయిస్తున్న ఆలయ అర్చకులు

### వినాయకునికి విశేష పూజలు

రాజమహేంద్రవరం రూరల్: జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా కొంతమూరు ఆఫీషియల్ కాలనీలోని వరసిద్ధ వినాయక మందిర్‌లో ఆదివారం స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్య భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- నరేంద్రపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం



నరేంద్రపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: ప్రతి గ్రామంలోను ప్రజా సంక్షేమంతో పాటు పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం నరేంద్రపురంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అవినీతి రహితంగా, ఇతర రాష్ట్రాలకు మార్గదర్శంగా జరుగుతుందన్నారు. బాపూజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా తీసుకువచ్చారన్నారు. కులాలు, మతాలు, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా అర్హతే ప్రధానంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ప్రభుత్వం తమదేనని సగర్వంగా చెప్పగలమన్నారు. గతంలో ఏ పథకం ద్వారా ప్రయోజనం పొందాలన్నా జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవలసి వచ్చేదన్నారు.

**రూ.7.5 కోట్లతో గ్రామాభివృద్ధి**

గడచిన నాలుగేళ్లలో నరేంద్రపురంలో గ్రామాభివృద్ధికి రూ.7.5 కోట్లు వెచ్చించామని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఇక్కడ అభివృద్ధి పనులు కేవలం రూ.64 లక్షలు మాత్రమే ఖర్చు చేశారన్నారు. తమ పాలనలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తూ, గ్రామాభివృద్ధికి పెద్దపీత వేస్తున్నామన్నారు. నీడ లేని 487 మంది పేదలకు నివాస స్థలాలు మంజూరు చేయడమే కాకుండా వాటిలో వారు పక్కా ఇల్లు కట్టుకునేలా తోర్పాటునందించామన్నారు. తిరుమల దేవస్థానం సహకారంతో గ్రామంలో వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామన్నారు. యువత కోరిక మేరకు త్వరలోనే ఈ గ్రామంలో డిజిటల్ లైబ్రరీని నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు తంగెళ్ల చిలకమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కోకన్వీనర్ గండి నానిబాబు, నాయకులు అడబాల చినబాబు, పంపన శ్రీను, ప్రగడ రామచంద్రరావు, ప్రగడ శివ, ప్రగడ రాంబాబు, రఘువర్మ, తదితరులు పాల్గొన్నారు.

### కోరుకొండలో యువకుడి దారుణహత్య



ముప్పిడిశెట్టి శ్రీను (ఫైల్)

మధురపూడి (కోరుకొండ): మండలంలోని పశ్చిమగానుగూడెం రోడ్డులోని ఎస్ఆర్ నగర్‌లో ఉన్న సప్లై కంపెనీ గొడౌన్ వద్ద ఒక యువకుడిని దుండగులు హత్య చేసి పరారయ్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు కోరుకొండలో వెంకటగిరి లైటింగ్స్ అండ్ డెకరేటర్స్ సప్లయి కంపెనీ యజమాని వెంకన్నకు ముప్పిడిశెట్టి శ్రీను అల్లుడు. అతని స్వగ్రామం గాడాల. సప్లయి కంపెనీ వ్యవహారాలన్నీ శ్రీను చూస్తుంటాడు. ఆదివారం రాత్రి కోరుకొండ పోస్టాఫీసు సెంటర్‌లో కంపెనీ వద్ద పని ముగించుకుని తన గొడౌన్ వద్ద అతడు పని చేస్తుండగా రాత్రి 9 గంటల సమయంలో కొందరు దుండగులు అతడి కళ్లలో కారం చల్లి పొట్టలో కత్తులతో పొడిచి పరారయ్యారు. కత్తిపోట్లకు పొట్టలోని పేగులు బయటకు రావడంతో చికిత్స నిమిత్తం అతడిని స్థానికులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే శ్రీను మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఎస్సై శారద సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## ఆకట్టుకున్న ఎడ్ల బండ్ల పోటీలు



ఎడ్ల బండ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- పోటీల్లో పాల్గొన్న 24 జతల ఎడ్లు

అనపర్తి: మండలంలోని పులుగుర్తలో ఆదివారం నిర్వహించిన ఎడ్ల బండ్ల పోటీలు ఆకట్టుకున్నాయి. పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పశు సంపదను పెంచి పోషించే విధంగా రైతులను ప్రోత్సహించేందుకు ఎడ్ల బండ్ల పోటీలు ఉపయోగపడతాయన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి, విజయనగరం జిల్లాల నుంచి సీనియర్స్ 1500 మీటర్ల విభాగంలో 6 జతలు, జూనియర్స్ 1000 మీటర్ల విభాగంలో 18 జతల ఎడ్లు కలిపి మొత్తంగా 24 జతల ఎడ్లు పోటీల్లో పాల్గొన్నాయి. పోటీల్లో సీనియర్స్ విభాగంలో కోరాడ వీరవెంకట సత్యవేణి(గుమ్మిలేరు), వేగుళ్ల తేజబాబు (మండపేట), గండి వెంకట్రావు(విజయనగరం) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. జూనియర్స్ విభాగంలో దొడ్డిపట్ల కోట శ్రావణ్(ధర్మవరం), వేగుళ్ల కృష్ణమాధవి(మండపేట), కొట్నాల శ్రీను(పులుగుర్త), వేగుళ్ల వీరవెంకటసత్యనారాయణ(మండపేట), గండి వెంకట్రావు(విజయనగరం), కూటి మహేష్(వెలుగుబంద) తొలి ఐదు స్థానాల్లో నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఆర్థిక సాయం

కడియం: ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి తోటి మిత్రులు రూ.75వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. కడియం గ్రామానికి చెందిన సాకుర్తి జాన్ గతేడాది విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. అతడికి భార్య, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు. వారికి చేయూతగా కడియం హైస్కూల్‌లో 2004–05 పదో తరగతి చదువుకున్న జాన్ మిత్రబృందం ముందుకు వచ్చి, నగదును సేకరించి జాన్ కుమార్తె పేరిట పోస్టాఫీసులో ఫిక్సిడ్ డిపాజిట్ చేశారు. ఆ బాండ్‌ను ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ చేతుల మీదుగా అతడి కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా మిత్రులను సత్యప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్, తామెళ్ల అయ్యప్ప, చిక్కాల శ్రీను, తోట మణికంత, మర్రి కాశీ, చక్రపాణి, గంధం వినయ్ పాల్గొన్నారు.

జాన్ కుటుంబానికి బాండు అందజేస్తున్న ఎంపీపీ సత్యప్రసాద్, చిత్రంలో మిత్రబృందం



### రుణాలు మంజూరు చేయాలి

సీటీఆర్ఐ: ఎలక్ట్రికల్ వర్కర్లకి టూల్ కిట్లు కోసం బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని కోరుతూ ఆర్డీఓ చైత్రవర్షిణిని కలిసి వినతి పత్రం అందజేసినట్టు గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బొజ్జ రామకృష్ణ తెలిపారు. ఆదివారం యూనియన్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూల్ కిట్లు విషయంలో బ్యాంకు సిబ్బంది సంప్రదించామని, వారు సానుకూలంగా స్పందించారన్నారు. అనంతరం కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో అకాల మరణం పొందిన వారి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. క్షతగాతులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఆసప శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ వీరవల్లి గంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.